అభినందించి..ఆర్థిక సాయం అందించి..

- ఐఐటీలో సీటు సాధించిన పేద విద్యార్థికి రూ.35 వేల సహాయం అందించిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి, జూన్ 20:వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన నిరుపేద విద్యార్థి దుర్గం అర్జున్ ఉన్నత చదువుల కోసం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి రూ.35 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇటీవల వచ్చిన (జేఈఈ)ఆడ్వాన్స్ పరీక్షలో ఆలిండియా 1782వ ర్యాంక్ సాధించి అర్జున్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఐఐటీ తిరుపతిలో సీటు సాధించాడు. ఫీజు కట్టేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో గురువారం ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కలిసి తన పరిస్థితిని వివరించాడు. ఐఐటీలో సీటు సాధించినందుకు విద్యార్థిని అభినందిస్తూ ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, అధ్యాపకులు చంద్రయ్య, కిరణ్, సంతోష్, రాజమౌళి, అశ్విని, విద్యార్థి ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్

జడ్జికి మొక్క అందజేస్తున్న కలెక్టర్

నస్పూర్, జూన్ 20 : మంచిర్యాల జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కుమార్ దీపక్ గురువారం జిలా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ న్యాయమూర్తికి మొక్కను అందజేశారు.

క్రీడాకారులను అభినందించిన కలెక్టర్

క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూన్ 20 : కర్ణాటక రాష్ట్రంలోని బాగల్‌కోట్‌లో ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన సౌత్‌జోన్ ఖోలో ఇండియా వుషూ ఉమెన్స్ లీగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన జిల్లా క్రీడాకారులను గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్ అభినందించారు. పతకాలు సాధించిన నవీన, అనిత, మన్విత, లక్ష్మీరాజ్, హర్షిత, హాసినిలను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి కీర్తి రాజ్‌వీరు, కోచ్ శివమహేశ్, వుషూ సంఘం సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రి రూరల్, జూన్ 20: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి,జిల్లా జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి 58 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి,షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఎంపీపీ గుర్రం మంగ,క్యాతన్పల్లి మున్సిపల్ చైర్మన్ జంగం కళ, జడ్పీటీసీ వేల్పుల రవి, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, ఆర్.ఐ పద్మజ, ఎంపీడీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, అధికారులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగంలో భాగమే బదీలీలు

రెబ్బెన, జూన్ 20: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగంలో భాగమే బదీలీలు అని రెబ్బెన జడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. రెబ్బెన టీజీబీ బ్యాంక్ లో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి బ్యాంక్ మేనేజర్‌గా ఉద్యోగోన్నతిపై బదిలీపై వెళ్తున్న నరేశ్‌ను పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ శాస్త్రి, నాయకులు జాకీర్, ముంజం రవీందర్, రైతులు ఉన్నారు.

కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ అధికారి పర్యటన

రెబ్బెన, జూన్ 20: బెల్లంపల్లి ఏరియా లోని గోలేటి ఓసీపీ కోసం సేకరించనున్న అటవీ భూములను గురువారం కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ పరిధిలోని ఐఆర్‌వో(ఇంటిగ్రేటెడ్ రీజినల్ అధికారి)త్రినాథ్‌కుమార్, ఎంఈఎఫ్ అండ్ సీసీ పర్యటించినట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. అటవీశాఖ అనుమతులు పొందిన భూముల్లో చేపట్టిన పనులు, నిర్మాణాలను సింగరేణి ఆధ్వర్యంలో నాటిన మొక్కలు, పెంచిన వృక్షాలను పరిశీలించారు. అటవీ భూములను పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్, సీఎఫ్ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఎఫ్‌డీవో విజయ్‌కుమార్, జీఎం(ఎస్టేట్) బండి వెంకటయ్య, ఎస్వోటూజీఎం మచ్చగిరి నరేందర్, ఎస్టేట్స్ అడిషనల్ మేనేజర్ సురేశ్, గోలేటి ఓసీ పీవో ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ఏరియా ఎస్టేట్ అధికారిణి నవనీత, బీపీఏవోసీటూ మేనేజర్ మహేశ్‌కుమార్, తదితరులున్నారు.

గోలేటి ఓసీపీ అటవీభూములు పరిశీలిస్తున్న త్రినాథ్‌కుమార్

తలసేమియా సికిల్‌సెల్‌ను నివారించాలి

మాట్లాడుతున్న సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్

మందమర్రి, జూన్ 20: తలసేమియా సికిల్‌సెల్ వ్యాధి నివారణకు అందరూ కృషి చేయాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, ఎంవీటీసీ మేనేజర్ శంకర్ అన్నారు. ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా గురువారం సింగరేణి వృత్తి శిక్షణ కేంద్రం(ఎంవీటీసీ)లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో వ్యాధి తీవ్రత ఎక్కువ ఉందని ఒక్క మంచిర్యాల జిల్లాలోనే సుమారు 300 మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. మంచిర్యాల బ్లడ్ బ్యాంకులో హెచ్‌బీఏ2 పరీక్ష రూ.500కే చేస్తారని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా మంచిర్యాల రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో ఉచిత వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవీటీసీ ట్రైనింగ్ అధికారి అశోక్ కుమార్, హెడ్‌ఓవర్‌మెన్ రాజేశం, రఘువరన్, కాసర్ల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యంత్రాల ద్వారా జరిగే ప్రమాదాలు అరికట్టాలి

సీసీసీ, నస్పూర్ 20 : యంత్రాల ద్వారా జరిగే ప్రమాదాలు అరికట్టాలని, రక్షణ చర్యలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి అమలు చేయాలని డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ (మెకానికల్) సుధీర్ గణపతిరావు బైసారో పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ సింగరేణి ఆతిథి గృహంలో జీఎం సంజీవరెడ్డి అధ్యక్షతన బెల్లంపల్లి, ఆర్జీ రీజియన్ భూగర్భ గనుల్లో మ్యాన్‌రైడింగ్, మ్యాన్ వైండింగ్ సిస్టం, ఫేస్ ఎక్విప్‌మెంట్ హాలర్స్ పనితీరుపై వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్ షాప్‌లో డీఎంఎస్ (సౌత్ సెంట్రల్ జోన్) సుధీర్ గణపతిరావు బైసారో పాల్గొని మాట్లాడారు. భూగర్భ గనుల్లో మ్యాన్‌రైడింగ్ సిస్టం, ఫేస్ ఎక్విప్‌మెంట్ హాలర్స్ పని తీరుపై వివరించారు. యంత్రాల్లోని లోటుపాట్లు సవరించాలన్నారు. రక్షణ సూత్రాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీఎంఎస్ దిలీప్‌కుమార్, జీఎం సేఫ్టీ గురువయ్య, మందమర్రి జీఎం మనోహర్, ఆడ్రియాల ప్రాజెక్టు జీఎం వెంకటేశ్వర్లు, రీజియన్ జీఎం సేఫ్టీ రఘుకుమార్, ఆర్జీ రీజియన్ జీఎం సేఫ్టీ కేహెచ్‌ఎన్ గుప్తా, ఏరియా ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్‌రావు, అన్ని గనుల అధికారులు పాల్గొన్నారు.

విధులకు హాజరవుతూ ఉద్యోగాలు కాపాడుకోవాలి

శ్రీరాంపూర్, జూన్ 20 : గైర్హాజరు ఉద్యోగులు హాజరు శాతాన్ని మెరుగు పరుచుకొని ఉద్యోగాలు కాపాడు కోవాలని శ్రీరాంపూర్ ఎస్వోటూజీఎం పురుషోత్తంరెడ్డి కోరారు. గురువారం జీఎం ఆఫీస్‌లో శ్రీరాంపూర్ ఏరియా గనులు, ఓసీపీలు, డిపార్ట్ మెంటుల్లోని గైర్హాజరు కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందారం 1ఏ గనిలోని గైర్హాజరు కార్మికులకు ఎస్వోటూజీఎం పురుషోత్తంరెడ్డి, సేవా అధ్యక్షు రాలు రాధాకుమారి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏడాదికి 100 మస్టర్లు పని చేయకుంటే ఉద్యోగాల నుంచి తొలగించనున్నట్లు తెలిపారు. 70 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారని డీవైజీఎం అరవిందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్య దర్శి ఎస్‌కే బాజీసైదా, డీవైసీఎంవో రమేశ్‌బాబు, డీవైపీఎం రాజేశ్, సీనియర్ పీవో అజ్మీరా రమేశ్, సేవా కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

'ఆధార్'ను నమోదు చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 20: జిల్లాలోని డ్రాయింగ్ అండ్ డిస్బర్స్మెంట్ అధికారులందరూ తమ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులందరి ఆధార్ సంఖ్యను ఐఎఫ్ఎమ్ఎస్ పోర్టల్లో నమోదు చేయాలని జిల్లా కోశాధికారి జాడి రాజేశ్వర్ తెలిపారు. ఐఎఫ్ఎమ్ఎస్ పోర్టల్ నమోదు చేసి ఉంటే సరి చూసుకోవాలన్నారు. జూన్ 25 తేదీలోగా సంబంధిత డ్రాయింగ్ అండ్ డిస్బర్స్మెంట్ అధికారులు ఈ నమోదును పూర్తి చేయాలని తెలిపారు.

తల్లి అంత్యక్రియలూ బరువాయెనా..!

- అద్దె ఇంట్లో మృతి చెందిన వృద్ధురాలు
- మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నిరాకరించిన కుమారులు
- కాలనీవాసుల ఆగ్రహంతో బిగివచ్చి అంత్యక్రియలు
- మందమర్రిలో అమానవీయ ఘటన

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

మల్లక్క మృతదేహం

మందమర్రి, జూన్ 20 : కనిపించి.. ప్రయోజకులను చేసిన తల్లికి తలకొరివి పెట్టాల్సిన కుమారులు పట్టనట్లుగా వ్యవహరించారు. చివరకు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేయగా, అప్పుడు అంత్యక్రియల నిర్వహణకు ముందుకొచ్చారు. ఈ అమానవీయ ఘటన మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో గురువారం జరిగింది. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీలోని ఓ అద్దె ఇంట్లో రాగంశెట్టి మల్లక్క (60) ఉంటున్నది. సింగరేణిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఆమె భర్త మల్లేశ్ నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి ముగ్గురు కుమారులు తిరుపతి, వెంకటేశ్, సురేశ్‌తో పాటు కూతురు కూడా ఉంది. కుటుంబ కలహాల కారణంగా వృద్ధురాలిని పట్టించుకోకపోవడంతో అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటున్నది. ఈ క్రమంలో గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయాన్ని ఇంటి యజమాని కొట్టె కొమురయ్య కుమారులకు సమాచారమందించగా అందరూ కలిసి వచ్చారు. కుటుంబ కలహాల కారణంగా తమ తల్లి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించేందుకు నిరాకరించారు. దీంతో కొడుకుల వ్యవహారంపై కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతకూ వారు స్పందించకపోవడంతో స్థానికులంతా కలిసి విరాళాలు సేకరించి అంత్యక్రియలకు సిద్ధమయ్యారు. చివరకు పెద్దమనుషుల జ్యోక్యంతో స్పందించిన కుమారులు తమ తల్లి మల్లక్క మృత దేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. చిన్న కుమారుడు సురేశ్ తలకొరివి పెట్టాడు. కొడుకుల వ్యవహారం.. వృద్ధురాలి ధీనస్థితిని చూసి అక్కడున్న మహిళలు కన్నీరు పెట్టుకున్నారు.

హామీలను దశల వారీగా అమలు చేస్తాం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

రెబ్బెన, జూన్ 20: సింగరేణి ఎన్నికల సమయంలో కార్మికుల మ్యానిఫెస్టో అంశాలను దశల వారీగా అమలు చేస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీ, గోలేటి సీహెచ్‌పీలలో గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్ కు ముఖ్య అతిథులుగా హాజరై కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణిలో ఏఐటీయూసీ యూనియన్ గెలిచి ఆరు నెలలైనా కంపెనీ గుర్తింపు పత్రం ఇవ్వక పోయినా ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు, మహిళ కార్మికులు ఏఐటీయూసీలో చేరగా వారికి కండువా కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి తదితరులున్నారు.

ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

మంచిర్యాలటౌన్, జూన్ 20: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఆరునెలలైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆరోపించారు. గురువారం మంచిర్యాలలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ, రైతు భరోసా కింద ఎకరానికి రూ 15వేలు, మహిళలకు రూ. 2500, వృద్ధులకు రూ. 4 వేల పింఛన్, యువతకు రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు, నిరుద్యోగులకు రూ. 4వేలు భృతి వంటి గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అనుచరులు ఖాళీ జాగా కనిపిస్తే కబ్జాలకు పాల్పడుతున్నారని అన్నారు. పీఎస్సార్ గెలిచాక వందరోజుల్లో ఎల్లంపల్లి నిర్వాసితులకు పరిహారం ఇప్పిస్తానని చెప్పి వారిని మోసం చేశారని అన్నారు. రాళ్లవాగుకు కరకట్ట నిర్మాణం చేపడుతామని దానిపై మాట్లాడడం లేదన్నారు. మంచిర్యాల – అంతర్గాంల మధ్య నిర్మించాల్సిన వంతెనను పీఎస్సార్ స్వలాభం కోసమే వేరే చోటకు మార్చాలని చూస్తున్నారని ఆరోపించారు. హామీలను నెరవేర్చేవరకు కాంగ్రెస్‌తో పోరాడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, జోగుల శ్రీదేవి, బొడ్డున మల్లేశ్, రెడ్డిమల్ల అశోక్, రాకేశ్‌రెణ్వా, పల్లి రాకేశ్, బింగి ప్రవీణ్, కమలాకర్‌రావు, వాణిశ్రీ, ఆకుల సంతోష్, ఆరెందుల శ్రీనివాస్, ఆర్జకొండ శ్రీనివాస్, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ఆవరణలోనే గంజాయి పెంపకం

- తనిఖీలు చేసి పట్టుకున్న పోలీసులు

ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు

మందమర్రి, జూన్ 20: మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని కేకే ఐదు ఫిల్టర్‌బెడ్ ఏరియాకు చెందిన కస్తూరి లింగయ్య తన ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచగా, స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు గురువారం పోలీసులు లింగయ్య ఇంటి వద్ద తనిఖీ చేయగా, 13 గంజాయి మొక్కలు కనపడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకొని లింగయ్యను అదుపులోకి తీసుకున్నారు.